ప్రజల మాట ప్రగతి బాట







బీఆర్ఎస్ మేడ్చల్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డికి బోడుప్పల్ చెంగిచర్ల యాదవ సంఘం ప్రతినిధులు ఆదివారం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్, సోమేశ్‌యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. -బోడుప్పల్, అక్టోబర్ 22

## కాంగ్రెస్, బీజేపీలకు సింగిల్ డిజిటే

### మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ)/కీసర: శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతాయని మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని మంత్రి నివాసం వద్ద ఆదివారం మేడ్చల్ నియోజకవర్గంలోని భోగారం, రాంపల్లి దాయర గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేయని అభివృద్ధి ఇప్పుడు ఎలా చేస్తుందని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి తొమ్మిదేండ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తప్ప కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మె పరిస్థితిలో లేరన్నారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ బీజేపీ పార్టీల అడ్రస్ గల్లంతు కావడం ఖాయంగా కనిపిస్తున్నదన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులకు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వలసలు బాగా పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రాభివృద్ధిని చూసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతు తెలుపలన్నారు. కాంగ్రెస్, బీజేపీలో చేరికలు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ప్రమోద్, రాము, శ్రీనివాస్, కిట్టు, మహేశ్, భాను, నర్సింహ శ్రీనివాస్, ప్రవీణ్, శేఖర్ తదితరులతో పాటు 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి మంత్రి మల్లారెడ్డి గులాబీ కండువా వేసి ఆహ్వానించారు.



ఆరో వార్డు సిఖ్ విలేజ్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఓ వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి లాస్యనందిత

## వచ్చేది.. ఇచ్చేది కేసీఆరే

### బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి లాస్యనందిత

కంటోన్మెంట్, అక్టోబర్ 22: తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కేసీఆరేనని, సంక్షేమ ఫలాలు ఇచ్చేదీ కేసీఆరేనని బీఆర్ఎస్ కంటోన్మెంట్ అభ్యర్థి లాస్యనందిత అన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం తదుపరి ఎన్నికల్లో గెలిచిన వెంటనే అర్హులందరికీ రూ.400కే వంట గ్యాస్ సిలిండర్లు అందుతాయన్నారు. కంటోన్మెంట్ పరిధిలోని ఆరో వార్డు ఎల్ఐసీ కాలనీ, బ్యాంకు కాలనీ, సిఖ్ విలేజ్, మస్తాన్ హోటల్ చౌరస్తా, కుమ్మరిగుట్ట, తాడ్‌బండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆదివారం లాస్యనందిత ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే రైతుబీమా మాదిరిగా కేసీఆర్ బీమా పేరిట రాష్ట్రంలోని అర్హులందరికీ రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందించనున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని కూడా రూ.15 లక్షలకు పెంచనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని ఇలాంటి హామీలను చూసిన ప్రతిపక్షాలకు నిద్ర పట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ గ్యారెంటీ హామీలను, మాయమాటలను ప్రజలెవరూ నమ్మడం లేదని అన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, సీనియర్ నాయకులు దీనానాథ్ యాదవ్, భాస్కర్ రెడ్డి, వంగల మల్లేశ్, ఝూన్సీ, జయరామ్, యశ్వంత్, నరహరి, చిన్నికృష్ణ, హేమలత, గుడియమ్మ, సాయిచరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తలసానికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న ఎంఐఎం నాయకులు

## తలసాని వెంటే మేమంతా

### మంత్రి తలసానికి అడుగడుగునా.. జననీరాజనం

అమీర్‌పేట్, అక్టోబర్ 22: అభివృద్ధి అంటే ఇది.. అనేలా చేసి చూపించిన బీఆర్ఎస్ సనత్‌నగర్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెంటే మేమంతా నడుస్తామని సనత్‌నగర్ అశోక్‌కాలనీ, డీఎస్ఎం కాలనీ, ఎస్ఆర్‌టీ కాలనీ నివాసితులు ముక్తకంఠంగా మంత్రి తలసానికి మద్దతు తెలిపారు. ఆదివారం ఉదయం సనత్‌నగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు మహ్మద్ షౌకత్ నేతృత్వంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి వెంట ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డి.పార్థసారథి నేతృత్వంలో సనత్‌నగర్, అమీర్‌పేట్ డివిజన్లకు చెందిన వయోధిక సంస్థల ప్రతినిధులు పెద్దసంఖ్యలో మంత్రి తలసాని మద్దతు తెలుపుతూ ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొన్నారు. మైనార్టీ ప్రాబల్యం అధికంగా ఉన్న ఈ ప్రాంతాలు గడిచిన దశాబ్ద కాలం వరకు అభివృద్ధికి దూరంగా ఉండేవని, అయితే మంత్రి తలసాని ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాతే ఇక్కడి ప్రజలకు అభివృద్ధిని పరిచయం చేశారని గుర్తు చేసుకుంటూ ముస్లిం మహిళలు మంత్రి తలసాని విజయం సాధించాలని కోరుకుంటూ... దట్టీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

#### 150 మంది యువకుల చేరిక

వివిధ కాలనీలకు చెందిన దాదాపు 150 మంది ఆదివారం మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యే ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి రూ. 1400 కోట్ల నిధులను వెచ్చించినట్లు చెప్పారు. అశోక్‌కాలనీ, డీఎస్ఎం కాలనీలో డ్రైనేజీ, మంచి నీటి సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామని, రాబోయే రోజుల్లో ఈ కాలనీలు మరింతగా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, నాయకులు సయ్యద్ నుమానుద్దీన్, సురేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

## ఉప్పల్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా

### బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 22 : ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని ఉప్పల్, హబ్సిగూడ, ఏఎస్‌రావునగర్, తదితర ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. హబ్సిగూడ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరిన హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు జైనవీన్ ఆధ్వర్యంలో వందల సంఖ్యలో యువకులు గులాబీ కండువా కప్పుకున్నారు. చిలుకానగర్ డివిజన్‌లో చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడారు. మూడోసారి సీఎంగా కేసీఆర్ రాబోతున్నారని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



పాదయాత్ర చేస్తూ ఎన్నికల మ్యానిఫెస్టో అంశాలున్న కరపత్రాన్ని అందజేస్తున్న మాగంటి గోపీనాథ్

## సంక్షేమ పథకాలతో పేదల్లో సంతోషాలు

### జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గోపీనాథ్

ఎర్రగడ్డ, అక్టోబర్ 22: ప్రతి పేద కుటుంబానికి పెద్దన్న పాత్ర పోషిస్తున్న కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన బోరబండలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. మైనార్టీలు సహా అడుగడుగునా గోపీనాథ్‌కు బ్రహ్మరథం పట్టారు. ఎన్నికల మ్యానిఫెస్టో వివరాలున్న కరపత్రాలను ఆయన పాదయాత్ర చేస్తూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ పేద కుటుంబాల్లో సంతోషాన్ని నింపిన సీఎం కేసీఆర్‌కు తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు అండగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అదనంగా లెక్కలేనన్ని సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. మోసపూరిత హామీలను గుప్పిస్తున్న పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. 9 ఏండ్లలో తెలంగాణ సాధించిన ఘన కీర్తిని వక్రీకరించే విపక్షాలకు తగిన విధంగా బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని వివరించారు. ప్రచార పర్వంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, విజయకుమార్, కోఆర్డినేటర్ విజయసింహ, లక్ష్మణ్ గౌడ్, ఆనంద్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారు

### ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, అక్టోబర్ 22: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆశం గారి కాలనీలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 80 ఎకరాల్లో ఉన్న గ్రీన్ జోన్, ఓపెన్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌గా మార్చినందుకు కాలనీవాసులు ముఖ్య మంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కాలనీ వాసులు గజమాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ కొన్నేండ్ల నుంచి గ్రీన్ జోన్, ఓపెన్ జోన్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఇండ్లు కట్టుకోవాలనుకున్న వారికి బ్యాంకులు రుణాలు ఇవ్వక పోవడం, మున్సిపల్ శాఖ నుంచి అనుమతి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడే వారన్నారు. ప్రజల సమస్యను గుర్తించిన సీఎం కేసీఆర్ చట్టాలను మార్పు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించినందుకు ప్రతి ఒక్కరూ సీఎంకు ధన్యావాదాలు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యేగా తన బాధ్యతను నెరవేర్చుకున్నానని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ఎన్నో సమస్యలను పరిష్కరించిన ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో బీమిడి స్వప్న, కాలనీ అధ్యక్షుడు ప్రమోద్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



గజమాలతో మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని సత్కరిస్తున్న కాలనీ వాసులు



జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ బస్తీలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

## బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, అక్టోబర్ 22: తెలంగాణ రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ పార్టీకే అధికారం దక్కనుందని అన్ని సర్వేల్లో స్పష్టమైన సంకేతాలు వస్తున్నాయని, ఖైరతాబాద్ నియోజకవర్గంలోనూ భారీ మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీదే విజయమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.46లోని అంబేద్కర్‌కాలనీలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే లక్ష్యంగా తొమ్మిదిన్నర ఏళ్లపాటు పని చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత మామిడి నర్సింగరావు , అంబేద్కర్ కాలనీ అధ్యక్షుడు గద్దల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఎం.మధుసూదన్, ఉపాధ్యక్షుడు శ్రీను, అందె వెంకన్న పాల్గొన్నారు.